TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 1 శనివారం 1-08-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వెల :2.00/-

### యూత్ కమిషన్ కోసం

## ప్రైవేట్ మెంబర్ బిల్లు



న్యూఢిల్లీ
: జెన్ జీ నిరసనలు, విద్యార్థులు, విపక్షాలతో అధికార పక్షానికి మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ ఎన్డీయే మిత్రపక్షం ఎల్‌జేపీ యువత కోసం శాశ్వతంగా జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలని లోక్‌సభలో శుక్రవారం ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టింది.అయితే మధ్యాహ్నం ఈ బిల్లుపై ఈ చర్చ జరగాల్సి ఉండగా, అంతకు ముందే సభ వాయిదా పడింది. యువతలో నిరుద్యోగం వంటి క్లిష్టమైన సమస్యలను తగ్గించేలా నైపుణ్యాభివృద్ధి, ఆంత్రప్రెన్యూర్‌షిప్, వ్యాపార ఆలోచనల అభివృద్ధి, యువ సృజనకారులకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి సాయం లాంటి అంశాలపై నిర్మాణాత్మక జాతీయ విధానాలను రూపొందించే నోడల్ ఏజెన్సీలా యూత్ కమిషన్‌ను తీర్చిదిద్దాలని బిల్లులో ప్రతిపాదించారు.




## సర్ గడువు పెంపు

- ఆగస్టు 8 నుంచి 10 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ల జాబితా
- అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా విడుదల

హైదరాబాద్,
తెలంగాణలో మరోసారి సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) గడువును పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 10 వరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గడువును పెంచుతున్నట్లు పేర్కొంది. ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శనరెడ్డి కోరారు. వాస్తవానికి తెలంగాణలో తొలుత జూలై 24తో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు ముగుస్తుండగా.. కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువును ఆగస్టు 3వరకు పొడిగించింది. ఆగస్టు

-మిగతా 2 లో



## ఇరాన్‌పై భూ దిగ్బంధం..

- ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకు అమెరికా--ఇజ్రాయెల్ వ్యూహం
- భూ దిగ్బంధనంతో ఆర్థికంగా దెబ్బతీయాలని యోచన
- ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలే లక్ష్యం
- సముద్ర దిగ్బంధానికి కొనసాగింపుగా కొత్త ప్రణాళిక
- ట్రంప్--నెతన్యాహు భేటీలో కీలక చర్చలు
- సరిహద్దు మార్గాల నియంత్రణపై దృష్టి
- ఇరాన్ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకున్న వ్యూహం

న్యూఢిల్లీ,
ఇరాన్‌పై నెలల తరబడి సాగిస్తున్న దాడులు ఆ దేశాన్ని తమ నియంత్రణలోకి తీసుకురావడంలో విఫలమైన నేపథ్యంలో ఇస్లామిక్ రిపబ్లిక్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు అమెరికా, ఇజ్రాయెల్ ఏదో ఒక రకమైన భూ దిగ్బంధనాన్ని అమలు చేసే విషయంపై చర్చలు సాగిస్తున్నాయి. ఈ భూ దిగ్బంధం కొంతకాలంగా అమలవుతున్న సముద్ర దిగ్బంధనానికి అనుబంధంగా ఉండవచ్చని విదేశీ మీడియా తెలిపింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పరిశీలనలో ఉన్న అనేక ప్రతిపాదనల్లో ఇది ఒకటి. మంగళవారం ఓవల్ ఆఫీసులో సమావేశమైన సందర్భంగా ట్రంప్, నెతన్యాహు గతిశీల, గతిశీల యేతర మార్గాల ద్వారా ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచే విషయాన్ని చర్చించినట్లు మీడియా తెలిపింది. ఎగుమతులు, దిగుమతుల ప్రవాహాన్ని -మిగతా 2 లో

### ఆగస్టులో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు

# శ్రీకారం

**టెండర్ ప్రక్రియ ప్రారంభం.. నిర్మాణాలకు సిద్ధమైన ప్రభుత్వం**

- మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తి
- ఆధార్ ఒక్కటే కాదు.. నివాస ధృవీకరణకు పలు పత్రాలు చెల్లుబాటు
- ఇల్లు రాకపోతే రూ. 10 వేల ఈఎండీ వంద శాతం తిరిగి చెల్లింపు
- దరఖాస్తులకు ఆగస్టు 10 చివరి తేదీ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ద పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి గారు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తికాగానే పనులు

-మిగతా 2 లో

## విదేశీ విద్యార్థులపై ట్రంప్ పిడుగు!




- ఓపీటీ ప్రోగ్రామ్ చేయాలంటే లక్ష డాలర్ల ఫీజు కట్టాల్సిందే
- పతిపాదనలు సిద్ధం చేస్తున్న డొనాల్డ్ ట్రంప్ సర్కార్!
- లక్షల మంది భారతీయ విద్యార్థులపై ఎఫెక్ట్: నిపుణులు

అమెరికాలో చదివి ఉద్యోగం చేయాలనే భారతీయ విద్యార్థుల కలలకు భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్రారు పై ఏకంగా 95 లక్షల రూపాయల (1 లక్ష డాలర్లు) ఫీజు విధించే ప్రతిపాదన వెలుగులోకి రావడంతో, విదేశీ విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే అమెరికాలో చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేయాలనుకునే వేలాది మంది భారతీయులపై భారీ ప్రభావం పడే అవకాశం ఉంది.

2

## పాకిస్థాన్‌లోనూ కాక్రోచ్ తరహా పార్టీ..




- భారత్ తరహాలో పాక్‌లోనూ కొత్త ఉద్యమం
- 'కాక్రోచ్ పార్టీ' పేరిట సోషల్ మీడియాలో సందడి
- అవినీతి, ఆర్థిక సమస్యలపై పోరాటమే లక్ష్యమని వెల్లడి
- విద్య, విద్యుత్, నీటి సమస్యలపై ఫోకస్
- లక్ష దాటిన ఫాలోవర్లు.. పెరుగుతున్న ఆదరణ
- 'దేశం ప్రజలది.. మాఫియాది కాదు' నినాదం
- ఐక్యతతో మార్పు కోసం పిలుపు

భారత్‌లో జెన్-జీ ఉద్యమం సృష్టించిన సంచలనం ఇప్పుడు పాకిస్థాన్‌కూ చేరింది. 'పాకిస్థాన్ కాక్రోచ్ పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ఆవిర్భవించిన కొత్త గ్రూప్.. అవినీతి, ఆర్థిక సంక్షోభం, పేలవ పాలనపై పోరాటమే తమ లక్ష్యమని ప్రకటించింది. ఇప్పటికే లక్షకు పైగా ఫాలోవర్లను ఆకర్షించిన ఈ ఉద్యమం పాక్‌లో రాజకీయ చర్చకు దారితీస్తోంది.

2



### సీఎం రేవంత్ రెడ్డి

## భాష సరిగ్గా లేదు

- బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విమర్శలు చేయడమా
- ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అని ప్రస్తావించడం తప్పు
- విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతూ విద్యార్థులను అవమానపరచడమా
- విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడమా
- ప్రజలు గమనిస్తున్నారు సరైన టైంలో బుద్ధి చెబుతారు
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి

హైదరాబాద్
తెలంగాణ ముఖ్యమంత్రి, స్వయంగా పాఠశాల విద్య, ఉన్నతవిద్య, సాంకేతిక విద్య శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్ రెడ్డి.. ఇంజినీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని ప్రస్తావించడం.. ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి ఆరోపించారు. సీఎం వంటి బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి.. ఒక సమస్యపై ఆరోగ్యకరమైన, నిర్మాణాత్మకమైన చర్చను ప్రారంభించి.. వ్యవస్థలో మార్పుకోసం ప్రయత్నం చేస్తే బాగుంటుంది. కానీ, విద్యార్థులపై 'క్రిమినల్ వేస్ట్' అనే పదాలను వాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. హార్వర్డ్ యూనివర్సిటీలో వీకెండ్ క్లాసులో నేర్చుకున్న రెండు పదాలను ఇక్కడికొచ్చి వాడేద్దామనే ప్రయత్నంలో 'జెన్-జే'ని అవమానిస్తున్నాననే విషయం కూడా ముఖ్యమంత్రి మర్చిపోయినట్లున్నారన్నారు. అసలు, రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రిగా, విద్యామంత్రిగా ఉన్న వ్యక్తి ఈ రంగంలో మార్పులకోసం ఏం చేశాడో చెప్పాల్సింది పోయి.. తెలిసీ, తెలియని పదాలను వాడి తానేదో మేధావినని నిరూపించుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరం అని అన్నారు. అయినా రెండున్నరేళ్ల తర్వాత హఠాత్తుగా సీఎం నిద్రనుంచి మేల్కొని.. ఇంజినీరింగ్ విద్యా ప్రమాణాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పగలరా? విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించమని అడుగుతున్నారనే ఆక్రోశంతో ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటు. -మిగతా 2 లో

### రండి...పెట్టుబడులు

# పెట్టండి

**పూర్తి సహకారమందిస్తాం**

- న్యూయార్క్ తో పోటీపడే వాతావరణం తెలంగాణ సొంతం
- భారత ఫ్యూచర్ సిటీలో ప్రపంచ ప్రఖ్యాత 500 కంపెనీలు
- 2037 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ఏఐ సునామీని తట్టుకునేలా నైపుణ్య అభివృద్ధిపై దృష్టి
- సీఐఐ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్
'రండి...తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. మీకు పూర్తి సహకారమందిస్తాం. తెలంగాణ అంటేనే వ్యాపారం. న్యూయార్క్ తో పోటీపడే వాతావరణం తెలంగాణలో ఉంది .' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఐఐ ఉత్తర భారత ప్రతినిధులతో అన్నారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పెట్టుబడులకు రక్షణగా నిలుస్తుందని సీఎం హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్ లో సీఐఐ ఉత్తర భారత ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా విజయవంతంగా కొనసాగుతున్నట్లే, సీఐఐ కూడా 130 ఏళ్ల నుంచి విజయవంతంగా కొనసాగుతోందన్నారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన సరళీకరణ, -మిగతా 2 లో





### ఆగస్టులో

## అరకొర వర్షాలే!

- బలహీనపడనున్న నైరుతి రుతుపవనాలు
- ఆగస్టులో సాధారణం కంటే తక్కువ వర్షాలు
- ఎల్‌నినో ప్రభావంతో వానలకు బ్రేక్
- దేశవ్యాప్తంగా 94 శాతం మాత్రమే వర్షపాతం: ఐఎండీ
- జూలైలో సాధారణ వర్షాలు.. ఆగస్టుపై ఆందోళన
- చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల సూచనలు

2



## జన నేతకు కన్నీటి వీడ్కోలు

- పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమ యాత్రకు వేలాది జనం
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- మంత్రి సీతక్క, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నివాళి

నర్సంపేట
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయానికి శుక్రవారం జనం కన్నీటి వీడ్కోలు పలికారు. అధికార లాంఛనాల మధ్య ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించింది. ఈ నెల 26న గుండెపోటుతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేరిన పెద్ది సుదర్శన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి12:30 గంటలకు మరణించినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి ఆయన భౌతికకాయాన్ని హనుమకొండ మీదుగా నర్సంపేటకు తీసుకొచ్చారు. వరంగల్-నర్సంపేట ప్రధాన

-మిగతా 2 లో



## పీవోజేకేలో ఆందోళనలపై పాక్ మారణకాండ..

- నాలుగు రోజుల్లో 42 మంది మృతి.. వందల మందికి గాయాలు
- పాక్ చర్యలను తీవ్రంగా ఖండించిన భారత్
- శాంతియుత నిరసనలపై బలగాల ప్రయోగం సరికాదన్న కేంద్రం
- ప్రపంచం స్పందించాలని భారత విదేశాంగ శాఖ పిలుపు
- 'సొంత ప్రజలపైనే పాక్ కర్కశ వైఖరి'
- ఎన్నికల బహిష్కరణతో పాక్‌కు ఎదురుదెబ్బ

2

పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ (పీవోజేకే)లో నిరసనకారులపై పాకిస్థాన్ ప్రభుత్వం సాగిస్తున్న అణచివేతపై భారత్ తీవ్రంగా మండిపడింది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై బలగాలను ప్రయోగించి 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయేలా చేసిందని ఆరోపించింది. పాక్ చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని, ఆ దేశాన్ని జవాబుదారీగా నిలపాలని న్యూఢిల్లీ డిమాండ్ చేసింది.

నవ సంఘర్షణ
TGTEL/26/A4846
తెలుగు దినపత్రిక
www.navasangharshana.com
శనివారం 1-08-2026

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ పిడుగు!

**ఓపీటీ ప్రోగ్రామ్ చేయాలంటే లక్ష డాలర్ల ఫీజు కట్టాల్సిందే**
**ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న డొనాల్డ్ ట్రంప్ సర్కార్!**
**లక్షల మంది భారతీయ విద్యార్థులపై ఎఫెక్ట్: నిపుణులు**




హైదరాబాద్, జూలై 31
విదేశీ విద్యార్థులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో షాక్ ఇవ్వబోతున్నారా? ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్ పూర్తి చేసి తద్వారా మెరుగైన ఉద్యోగం, హెచ్-1బీ వీసా సాధించాలనుకొనే విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లబోతున్నారా? తాజా వార్తలను బట్టి చూస్తే ఇది నిజమేననిపిస్తున్నది. అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో చదువుకొని.. ఓపీటీ చేయాలనుకొనే విద్యార్థులకు లక్ష డాలర్ల ఫీజు (రూ. 95 లక్షలు) విధించాలనే ప్రతిపాదనలను ట్రంప్ సర్కార్ పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు అమెరికన్ పత్రిక 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' ఓ కథనంలో పేర్కొంది. ఇదే జరిగితే, అమెరికాలో చదువు పూర్తిచేసి అక్కడే ఉండి మెరుగైన ఉద్యోగం చేయాలనుకొనే వారికి పెద్ద ఎదురు దెబ్బేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ, ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే ఓపీటీ ప్రోగ్రామ్‌పై విద్యార్థులు ఆశలు వదులుకోవాల్సిందేనని చెప్తున్నారు.

అసలేమిటీ ఓపీటీ?
డిగ్రీ పూర్తైన విదేశీ విద్యార్థులు ఎలాంటి వర్క్ వీసా అవసరం లేకుండా అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి వెసులుబాటు కల్పించేదే ఓపీటీ. ఇంకా వివరంగా చెప్పాలంటే.. ఎఫ్-1వీసాతో అమెరికాకు వెళ్లిన విదేశీ విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ పూర్తైన తర్వాత 1-3 ఏండ్లపాటు తమ రంగంలో అనుభవం పొందేందుకు ఈ ఓపీటీ ప్రోగ్రామ్ సాయపడుతుంది. ఓపీటీకి ఎంపికైతే తొలి ఏడాది అక్కడి సంస్థల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. స్టెమ్ కోర్సులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) పూర్తి చేసిన వారికి అదనంగా మరో రెండేండ్లు పనిచేసే వెసులుబాటు లభిస్తుంది. ఇదేసమయంలో పలువురు తమ ఉద్యోగావకాశాలను మెరుగుపర్చుకొని హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేసుకొంటారు. అయితే, ఇప్పుడు ఓపీటీ చేయాలనుకొనే విద్యార్థులకు లక్ష డాలర్ల ఫీజు విధించాలనే ప్రతిపాదనలను ట్రంప్ సర్కార్ తెరమీదికి తీసుకురావడంతో విదేశీ విద్యార్థులు పునరాలోచనలో పడినట్లయ్యింది.

భారతీయ విద్యార్థులపై ప్రభావం ఇలా..
అమెరికాలో ప్రస్తుతం అతిపెద్ద అంతర్జాతీయ విద్యార్థుల సమూహంగా భారతీయ విద్యార్థులు ఉన్నారు. ఓపెన్ డోర్స్ తాజా నివేదిక ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో అమెరికాలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో 3.63 లక్షల మంది భారతీయులు చేరారు. ఇందులో దాదాపు 40 శాతం మంది ఓపీటీ ప్రోగ్రామ్ ఎంచుకొంటున్నారు. బ్యాంకు రుణాలతోనే చాలామంది అమెరికా బాటపడుతున్నారు. తాజా ప్రతిపాదనలతో వీరిపై తీవ్ర ప్రభావం పడొచ్చని నిపుణులు చెప్తున్నారు. కాగా హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజును ఫెడరల్ కోర్టు అడ్డుకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ట్రంప్ సర్కార్ ఓపీటీపై కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చినట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పాకిస్థాన్‌లోనూ కాక్రోచ్ తరహా పార్టీ..

- భారత్ తరహాలో పాక్‌లోనూ కొత్త ఉద్యమం
- 'కాక్రోచ్ పార్టీ' పేరిట సోషల్ మీడియాలో సందడి
- అవినీతి, ఆర్థిక సమస్యలపై పోరాటమే లక్ష్యమని వెల్లడి
- విద్య, విద్యుత్, నీటి సమస్యలపై ఫోకస్
- లక్ష దాటిన ఫాలోవర్లు.. పెరుగుతున్న ఆదరణ
- 'దేశం ప్రజలది.. మాఫియాది కాదు' నినాదం
- ఐక్యతతో మార్పు కోసం పిలుపు




ఇస్లామాబాద్:
భారత్‌లో జెన్-జీ ఉద్యమం సాధించిన విజయంతో స్ఫూర్తి చెంది.. తమను తాము 'పాకిస్థాన్ కాక్రోచ్ పార్టీ'గా పేర్కొంటూ ఒక గ్రూప్ సామాజిక మాధ్యమంలో ఆవిర్భవించింది. అవినీతి, పేలవమైన పాలన, దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి తదితర సమస్యలపై పోరాటం సాగిస్తామని ప్రకటించింది. ఆర్థిక, రాజకీయ స్థిరత్వం, నాణ్యమైన విద్య, దేశంలోని కరెంట్ కోతల నివారణ, నీటి ఎద్దడి సమస్యలపై దృష్టి సారించడమే తమ అజెండాగా ఆ గ్రూప్ పేర్కొంది. దీంతో ఆ గ్రూప్‌లో ఇప్పటికే 1,12,000 మందికి పైగా ఫాలోవర్లు చేరారు. 'పాకిస్థాన్ దాని ప్రజలది, అవినీతి మాఫియాది కాదు' అన్నది తమ నినాదమని ప్రకటించింది. ఐక్యత, మార్పు కోసం ఉద్యమంగా తమను తాము చాటుకుంది.

# సీఎం రేవంత్ రెడ్డి భాష సరిగ్గా లేదు

మొదటి తరువాయి
ప్రభుత్వం రూ.10,000 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అందులో రూ.5,000 కోట్లకు పైగా కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకే చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లించాలనే విద్యార్థుల డిమాండ్‌ను తట్టుకోలేక, ఫ్రస్ట్రేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని క్రిమినల్స్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో కూడా ఇంజినీరింగ్ కాలేజీలు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తే 'తమాషాలు చేస్తే కాటు తీస్తాం' అంటూ ముఖ్యమంత్రి స్థాయిని మరచి ఇష్టారీతిన మాట్లాడారు. కాలేజీలు ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ విచారణ పేరిట విద్యాసంస్థల మీద దాడులు చేయించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ విద్యార్థుడికి 15% గా చేస్తామన్న హామీని అటకెక్కించిన.. ముఖ్యమంత్రి 'గురివింద గింజ' ఆలోచనతో రాష్ట్ర విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారనేది సుస్పష్టంగా కనబడుతోందన్నారు. ఒకవైపు రాజకీయ అవసరాలకోసం 'జెన్-జే'ల ఆకాంక్షలు తామే దేకేదార్ అని ప్రకటనలు ఇస్తూనే.. మరోవైపు, అదే 'జెన్-జే'లను క్రిమినల్స్ గా పోల్చిన రేవంత్ రెడ్డి విజ్ఞతను తెలంగాణ సమాజం ప్రశ్నిస్తోందన్నారు. ఇది రేవంత్ రెడ్డి వరకే పరిమితం కాలేదు. 2015లో నాటి సీఎం కేసీఆర్ కూడా.. మన ఇంజినీరింగ్ విద్యార్థుల స్టాండర్డ్స్ సరిగా లేవని.. తనతో ఎవరో చెప్పారని, ఈ మాటతో తనకు సిగ్గుపోయింత పనైందని.. అసెంబ్లీ వేదికగా చెప్పారు. మన ఇంజినీరింగ్ విద్యార్థులవి.. వానాకాలం చదువులని విమర్శించారు. ఈ ప్రకటన చేసిన తర్వాత 9 ఏళ్లు అధికారంలో ఉన్నా.. తనను ఆవేదనకు గురిచేసిన అంశంలో మార్పులకోసం మాత్రం కేసీఆర్ ఏమాత్రం ప్రయత్నించలేదు అని అన్నారు. కేసీఆర్ 10 ఏళ్లు, రేవంత్ రెడ్డి రెండున్నరేళ్లు.. అంటే దాదాపు 12 ఏళ్లయినా.. తెలంగాణలో విద్యావ్యవస్థ 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు' తయారైందంటే.. ముఖ్యమంత్రులు ఎంత గొప్పగా పనిచేశారో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలి అని అన్నారు. నిజానికి హైదరాబాద్ ఐటీ కేంద్రంగా ప్రపంచ ఖ్యాతిని పొందడంలో.. ఇక్కడి ఇంజినీరింగ్ విద్యార్థుల కృషిలేదా? ఇక్కడ ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులు అంతర్జాతీయ ఐటీ, నిర్మాణ, మెకానికల్ కంపెనీల్లో ఉన్నతస్థానాల్లో ఉండటం వాస్తవం కాదా? తెలంగాణ యువ ఇంజినీర్లు.. 'క్రిమినల్ వేస్ట్' కాదు.. వాళ్లు ఇన్నోవేటర్స్ గా, ఆంట్రప్రెన్యూర్స్ గా, రీసెర్చర్లుగా.. నేషనల్ బిల్డర్లుగా తమ సత్తా చాటుకుంటున్నారు అని అన్నారు. అలాంటి యువతను, ఇంజినీరింగ్ విద్యార్థులను.. తెలంగాణ రాష్ట్ర తొలి, రెండో ముఖ్యమంత్రులు.. తక్కువచేసి చూపించే ప్రయత్నం చేశారు. కచ్చితంగా, ఇంజినీరింగ్ విద్యను మరింత నాణ్యతతో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం, ప్రైవేటు విద్యాసంస్థలు కలిసి.. విద్యావ్యవస్థను, పరిశ్రమలతో అనుసంధానం చేసి.. ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడంలో చొరవతీసుకోవాలి. కానీ, ఇలా 'క్రిమినల్ వేస్ట్', 'వానాకాలం చదువులు', 'సిగ్గనిపించింది' అనే పదాలను వాడేముందు కాస్త ఆలోచన చేయాలి. 'జెన్-జే' ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని సూచించారన్నారు.

# ఆగస్టులో అరకొర వర్షాలే!

- బలహీనపడనున్న నైరుతి రుతుపవనాలు
- ఆగస్టులో సాధారణం కంటే తక్కువ వర్షాలు
- ఎల్‌నినో ప్రభావంతో వానలకు బ్రేక్
- దేశవ్యాప్తంగా 94 శాతం మాత్రమే వర్షపాతం: ఐఎండీ
- జూలైలో సాధారణ వర్షాలు.. ఆగస్టుపై ఆందోళన
- చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల సూచనలు



న్యూఢిల్లీ, జూలై 31
పసిఫిక్ మహాసముద్రంపై ఒక మోస్తరు ఎల్ నినో కొనసాగుతున్నందున నైరుతి రుతుపవనాలు బలహీనపడవచ్చని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. ఆగస్టులో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. శుక్రవారం తన తాజా నెలవారీ, కాలానుగుణ అంచనాలను ఐఎండీ విడుదల చేస్తూ ఆగస్టులో దేశంలో సగటు వర్షపాతం దీర్ఘకాలిక సగటు(ఎల్‌పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. 1971-2020 మధ్యకాలపు వాతావరణ గణాంకాల ఆధారంగా ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 254.9 మిల్లీమీటర్లుగా ఉంటుంది. ఏరుతుపవన పీడనాల కారణంగా జూలైలో దేశంలో దాదాపు సాధారణ వర్షపాతం నమోదైన నేపథ్యంలో ఈ అంచనా వెలువడింది. ఆగస్టులో దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. వాయవ్య, ఈశాన్య, తూర్పు-మధ్య భారతదేశంలో సాధారణ లేదా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

# ఆగస్టులో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు శ్రీకారం

మొదటి తరువాయి
ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.
హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని చెప్పారు. పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.
ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ను ఉచితంగా వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్లు కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుదారులు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఈఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈఎండీ చెల్లిస్తే, అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా, సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# రండి...పెట్టుబడులు పెట్టండి

మొదటి తరువాయి
ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ఫలితాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నామని సీఎం అన్నారు. ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదని సీఎం అన్నారు. 1994 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అనేక పెట్టుబడులను ఆకర్షించారని, బిల్ గేట్స్ , బిల్ క్లింటన్ లాంటి దిగ్గజాలను హైదరాబాద్ కు తీసుకువచ్చారని సీఎం గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతయ ఎయిర్ పోర్టు, అవుటర్ రింగ్ రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో వాళ్లు కొన్ని పాలసీలు తీసుకువచ్చారని, వాటిని కొనసాగిస్తూనే తాము సరికొత్త పాలసీలు తీసుకువచ్చామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదని, నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకువస్తే అది కొనసాగుతోందన్నారు. తాము తీసుకువచ్చిన పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, మంచి ప్రతిపాదనలతో వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఫార్చ్యున్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో గత డిసెంబర్ లో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేశామని, సమ్మిట్లో 175 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారని సీఎం వివరించారు. తెలంగాణ రైజింగ్ - 2047 పాలసీని గ్లోబల్ సమ్మిట్ లో ప్రకటించామని సీఎం తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా అయిదు శాతంగా ఉందని, అది10 శాతంగా ఉండాలన్నదే తన లక్ష్యమని సీఎం వెల్లడించారు. కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబయి, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సీఎం తెలిపారు. 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగు రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సర్వీస్ సెక్టార్‌కు పెద్ద పీట వేస్తున్నామని సీఎం తెలిపారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని, అక్కడ మాన్యుఫ్యాక్చర్ రంగానికి ప్రాధాన్యమిస్తున్నామని సీఎం తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు వెలుపల వ్యవసాయ రంగానికి, అగ్రి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సీఎం వివరించారు. ప్యూర్, రేర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతో పాటు ఇతర వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీ పట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మించనున్నామని, విభాగాల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సీఎం వివరించారు. వరంగల్, ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు కేంద్రం నుంచి అనుమతి తెలిపిందని, 7 బుల్లెట్ ట్రైన్ల ను కేంద్రం ప్రకటిస్తే 3 తెలంగాణకు వచ్చాయన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీ పడదల్చుకోలేదని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీ పడేలా తెలంగాణను నిలపడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2037 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. తెలంగాణ సంస్కృతి తమకు పెద్ద ఆస్తి అని, హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని సీఎం తెలిపారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందని సీఎం అన్నారు. పారిశ్రామికవేత్తలు తమకు ఏం కావాలో చెబితే ఆ వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని, పరిశ్రమల శాఖ మంత్రి ప్రతి రెండు నెలలకోసారి, తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం తెలిపారు. తెలంగాణను మీ సొంత ప్రాంతంగా భావించాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం సూచించారు. ఏఐ సునామీతో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని, దాంతో తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పామని, దానికి ఛైర్మన్ గా ఆనంద్ మహీంద్రా, డైరెక్టర్లుగా కార్పొరేట్ కంపెనీల దిగ్గజాలు ఉన్నారని సీఎం తెలిపారు. దేశంలోనే తమది బెస్ట్ స్కిల్ యూనివర్సిటీ అని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామని, అందులో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయని సీఎం తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. ఇక్కడి జీసీసీ ల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని, అమెజాన్ డేటా సెంటర్ల పైన రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెడుతోందని, అదాని రూ.35 వేల కోట్లు డేటా సెంటర్ పైన పెట్టుబడి పెడుతోందని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ నార్తరన్ రీజియన్ వైస్ ఛైర్మన్ శారదా సూరి మార్వా, ప్రతినిధులు కృష్ణ బోధనపు, గౌరవ్ మహేశ్వరి, వనిత దాట్ల, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వినోద్ కె బాప్న తదితరులు పాల్గొన్నారు.

# సర్ గడువు పెంపు

మొదటి తరువాయి
అరెంజ్మెంట్ చేయాలని ఆదేశించింది. ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల, క్లెయిమ్స్, అభ్యంతరాలను ఆగస్టు 8 నుంచి అక్టోబర్ 10 లోపు చేపట్టాలని తెలిపింది. అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే ఆగస్టు 3లోగా మొత్తం ఓటర్ల సమగ్ర సవరణకు గడువు సరిపోదని, మరోసారి గడువు పెంచాలని వినతులు రావడంతో ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు గడువు పెంచింది. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు (ఫారం-6) లేదా చిరునామా మార్పులు, వివరాల సవరణల కోసం (ఫారం-8) దరఖాస్తు చేయాలనుకునే వారు... ముసాయిదా జాబితా విడుదలయ్యే ఆగస్టు 10 తర్వాతే తమ అప్లికేషన్లను సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

సర్ నూతన షెడ్యూల్...
- ఆగస్టు 3వరకు: బిఎల్‌ఓల ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ.
- ఆగస్టు 10న: ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా విడుదల.
- ఆగస్టు 8 నుంచి 10 వరకు: అభ్యంతరాలు, క్లెయిమ్ల స్వీకరణ, పరిష్కారం.
- అక్టోబర్ 12న: తుది ఓటర్ల జాబితా ప్రచురణ.

కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఆరా...
ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణలో శుక్రవారం పర్యటించారు. తెలంగాణలో సర్ ప్రక్రియ అమలును సమీక్షించారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి సుదర్శనరెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న సర్ ప్రక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో సర్ నెమ్మదించడంపై ఆరా తీశారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో జరుగుతున్న సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# జన నేతకు కన్నీటి వీడ్కోలు

మొదటి తరువాయి
రహదారిపై అడుగడుగునా పెద్దికి జనం నివాళులర్పించారు. గిర్నిబావి సెంటర్ నుంచి నర్సంపేట వరకు 10 కిలో మీటర్ల వరకు రోడ్డుపై అంతిమ యాత్ర జనసందోహంతో కొనసాగింది. పట్టణంలోని అయ్యప్ప గుడి నుంచి ప్రధాన రహదారిపై వేలాది మంది అభిమానుల నడుమ అంతిమ యాత్ర సాగింది. అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆయన మృతదేహన్ని తీసుకొచ్చారు.

నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు, మంత్రి సీతక్క
పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయానికి మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, సత్యవత్‌రాథోడ్, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు పోచంపెల్లి శ్రీనివాసరెడ్డి, గోరెటి వెంకన్న, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో హరీశ్‌రావు, కేటీఆర్ తదితర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. వర్షం కురిసినా అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొని పెద్దికి తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించడంతో దానికి తగ్గ ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు ఆయన కుమారుడు నిదర్శన్ రెడ్డి చితికి నిప్పంటించారు.

# పీవోజేకేలో ఆందోళనలపై పాక్ మారణకాండ..



న్యూఢిల్లీ, జూలై 31
పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ (పీవోజేకే)లో పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెండు నెలలుగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల్ని అణిచివేయడానికి పాక్ ప్రభుత్వం అత్యంత కఠినంగా, అమానవీయంగా వ్యవహరిస్తోంది. రావల్‌కోట్‌లో నిరసనకారులపై పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో నాలుగు రోజుల్లోనే 42 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. అయితే, ఈ అణిచివేతపై భారత ప్రభుత్వం స్పందించింది. పాక్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించింది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సామాన్య ప్రజలపై నిర్దాక్షిణ్యంగా బలగాల్ని ప్రయోగించడం సరికాదని భారత్ వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ప్రపంచం స్పందించాలని, పాక్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఒక ప్రకటన చేశారు. "పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సామాన్య ప్రజలపై పాక్ ప్రభుత్వం దారుణంగా బలగాల్ని ప్రయోగిస్తోంది. పాక్ చర్య వల్ల ఇప్పటికే 40 మంది మరణించడం విచారకరం. ఇంకా ఎందరో తీవ్రంగా గాయపడ్డారు. పాక్ అసహ్యమైన చర్యకు పాల్పడింది. సాధారణ ప్రజల్ని శత్రువులుగా వర్ణించడం సరికాదు. ఒకప్పుడు ఉగ్రవాదులకు శిక్షణ, ఆయుధాలు, నిధులు ఇచ్చిన పాక్ ప్రభుత్వం ఇప్పుడు సొంత దేశానికే వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. పీవోజేకేలో నిర్వహించబోయే ఎన్నికలు పాకిస్తాన్ హింసాత్మక ధోరణికి వ్యతిరేకంగా నిలుస్తున్నాయి. అంతర్జాతీయ సమాజం కూడా పాకిస్తాన్ చర్యలపై స్పందించాలి. పాక్ ప్రభుత్వాన్ని జవాబుదారిగా చూపాలి" అని జైశ్వాల్ అన్నారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీవోజేకేలో చేపట్టిన ఆందోళనలు 51వ రోజులకు చేరుకున్నాయి. ఆందోళనకారులపై పాక్ బలగాలు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుండటంతో వందలాది మంది ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో ఆగస్టు 2న జరగబోయే ఎన్నికలను స్థానికులు బహిష్కరించారు.

# ఇరాన్‌పై భూ దిగ్బంధం..

మొదటి తరువాయి
అడ్డుకునేందుకు సరిహద్దు మార్గాలను పటిష్టం చేయాలని ఇరాన్‌కు పొరుగున ఉన్న దేశాలు, ప్రాంతీయ భాగస్వామ్య దేశాలపై తమ ప్రణాళిక అమలు కోసం ఒత్తిడి తీసుకురావలసి ఉంటుందని రెండు దేశాల నాయకులు భావిస్తున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.5 వేల జరిమానా



**రామగిరి: జులై 31 నవ సంఘర్షణ**
రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది.నిందితుడు ఎండీ రహీంపాషా,తండ్రి కాజమియా 36 సం,శివరాం నగర్ పన్నూర్ గ్రామం,రామగిరి మండలం, పెద్దపల్లి జిల్లా. వివరాల్లోకి వెళితే
బాధితురాలు తండ్రి 05-11-2020 నాడు తన 14 సంత్సరాల కుమార్తె ఇంటి నుండి కనిపించకుండా పోయిందని పిర్యాదు చేయడం తో రామగిరి పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 138/2020 ంవ‌ష 363 ఐ పి సి కింద కేసు నమోదు చేశారు దర్యాప్తు సమయం లో బాధితురాలు ను గుర్తించి ఆమె వాంగ్మూలం నమోదు చేయగా నిందుతుడు ఎండీ రహీం పాషా ప్రేమ వివాహం పేరుతొ మోస పూరితంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు వెల్లడయింది దీంతో దర్యాప్తు లో సేకరించిన ఆధారల మేరకు కేసు లో సెక్షన్ 366-ఏ 376(2)(3) ఐ పి సి మరియు పోక్సో చట్టం సెక్షన్ 6 లను చేర్చి సెక్షన్ ఆల్టరేషన్ మెమో ను న్యాయస్థానం లో సమర్పించారు అప్పటి ఏసీపీ వి.ఉమేందర్ మరియు ఏ.మహేందర్ ఎస్ ఐ లు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.అనంతరం దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో కేసు విచారణ జరగగా,న్యాయమూర్తి స్వప్నరాణి ఇరుపక్షాల వాదనలు,సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు ఎండీ రహీం పాషా మీద నేరా అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించి నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5.000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో నేరం రుజువై నిందితుడికి శిక్ష పడడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్,ఎం సాధ్యారాణి భరోసా లీగల్ కౌన్సిలర్ లు సమర్థవంతంగా కీలక పాత్ర పోషించారు.పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి,ఏసీపీ మడుతా రమేష్ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో సహకరించిన మంథని సీఐ బుద్దె స్వామి , రామగిరి ఎస్సై టీ .శ్రీనివాస్ ,కోర్టు కానిస్టేబుల్ సి డి ఓ ఎస్ కె షాహాభాజ్ ,లైజన్ ఆఫీసర్ పి. కోటేశ్వరరావులను రామగుండం పోలీస్ కమిషనర్ డీఐజీ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్. అభినందించారు.

## ప్రభుత్వ సేవలో డీటీఓ కొండ కరుణాకర్ సేవలు అభినందనీయం




**పెద్దపల్లి, జులై 31 నవ సంఘర్షణ**
ప్రభుత్వ సేవలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి కొండ కరుణాకర్ సహ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని టీజీఓఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, జిల్లా వ్యవసాయ అధికారి డీఏఓ తూము రవీందర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ఖజానా శాఖ సహాయ సంచాలకులు డీటీఓ, టీజీఓఎస్ ట్రెజరర్ గా పదవీ విరమణ పొందిన సందర్భంగా టీజీఓఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన తూము రవీందర్ మాట్లాడుతూ ఆయన తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ, సంతోషాలతో శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తూము రవీందర్ తో పాటు ఇతర అధికారులు ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఓ సాజిద్ అలీ, డీఏఓ రవీంద్రనాథ్, డాక్టర్ సురేష్, డాక్టర్ మల్లేష్‌లతో పాటు ఖజానా శాఖ అధికారులు, టీజీఓఎస్ నాయకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు వీడ్కోలు పలికారు..

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు తేదీని ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి పొడిగించింది.



**/మహబూబాబాద్ జులై 31 నవ సంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు తేదీని ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి పొడిగించింది. ఆగస్టు3వ తేదీతో పూర్తి కావాల్సిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది... ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది.

**తెలంగాణలో 77.12 శాతం ఎన్యుమరేషన్ పూర్తి..**
ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది. జూన్ 25 నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయినట్లు ఈసీ తెలిపింది. హైదరాబాద్ నగరంలో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం ఎన్యుమరేషన్ పూర్తయినట్లు గా ఎన్నికల సంఘం వెల్లడించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37శాతం ఎన్యుమరేషన్ పూర్తయింది.

# మనోహరాబాద్ సమీపంలో జరిగిన దారుణ హత్యపై జిల్లా కోర్టు తీర్పు

**-తల్లి హత్య కేసులో దంపతులకు జీవిత ఖైదు**
**-ఒక్కొక్కరికి రూ.7 వేల జరిమానా..**
**-దర్యాప్తు చేసిన పోలీసులను అభినందించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్, జులై 31 నవ సంఘర్షణ**
మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ సర్కిల్ పరిధిలోని మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన వృద్ధురాలి హత్య కేసులో నిందితులైన సహజీవనం చేస్తున్న దంపతులు బి. కిరాజీ (36), జక్కుల చంద్రకళ (34)లిలకు మెదక్ జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. అలాగే ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.14 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కిరాజీ, చంద్రకళలు చంద్రకళ తల్లి రాధ వద్ద ఉన్న నగదును కాజేయాలనే ఉద్దేశంతో హత్యకు కుట్ర పన్నారు. 2020 అక్టోబర్ 11న రాధకు మద్యం తాగించి, కిరాజీ నడిపిన ఆటోలో తీసుకెళ్లారు. కిరాజీకి పరిచయమున్న లక్కీ, సలీంలను కూడా వెంట తీసుకుని ఉప్పుగూడ నుంచి బోయిన్‌పల్లి మీదుగా మనోహరాబాద్ సమీపానికి చేరుకుని, హైవే పక్కన ఉన్న నిర్జన ప్రాంతంలో రాధను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం నిందితులు హైదరాబాద్‌లోని ఉప్పుగూడ లో ఉన్న రాధ ఇంటికి వెళ్లి అక్కడ దాచిన రూ.4 లక్షల నగదును అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. అందులో రూ.50 వేలును లక్కీ, సలీంలకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హత్యకు ఉపయోగించిన కత్తిని ఇంట్లో దాచిపెట్టగా, మిగిలిన డబ్బుతో బంగారం, వెండి వస్తువులు కొనుగోలు చేసి గుజరాత్‌కు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన సమయంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో మనోహరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి దర్యాప్తు అధికారులు స్వామిగౌడ్, శ్రీధర్ సమగ్ర విచారణ చేపట్టి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. వెంకటేశ్ సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో,సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున జరిమానా విధించింది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ సమన్వయంలో విశేష కృషి చేసిన జిల్లా లైజనింగ్ అధికారి ఎస్ఐ బి. విఠల్, కోర్టు లైజనింగ్ పీసీ జి. రవీందర్‌గౌడ్, సీడీఓ మహిపాల్‌రెడ్డితో పాటు సంబంధిత పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

**-ఈ-కేవైసీ గడువు ఆగస్టు 31 వరకు**
**-రేషన్ కార్డుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**-జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద**



**మెదక్, జులై 31 నవ సంఘర్షణ**
మెదక్ జిల్లా పరిధిలోని రేషన్ కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్-- 2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆగస్టు 1వ తేదీ నుంచి మూడు నెలల బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారుడు తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాప్ (ఎఫ్‌పీఎస్) కు వెళ్లి మూడు నెలల బియ్యం కోటాను తప్పనిసరిగా పొందాలని కోరారు. అదే విధంగా రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి ఈ-కేవైసీ (వ-ఖ్జ) ప్రక్రియను ఆగస్టు 31వ తేదీలోపు పూర్తి చేయించాలని సూచించారు.ముఖ్యంగా చిన్నారుల ఈ-కేవైసీని ఐరిస్ (×తీఱం) పరికరం ద్వారా సులభంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులందరి ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ సేవలు నిరంతరంగా అందుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్లు ఆగస్టు 1 నుంచి నిర్ణీత సమయానికి దుకాణాలను తెరిచి, లబ్ధిదారులకు మూడు నెలల బియ్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారునికి వ్యక్తిగతంగా సమాచారం అందించి, ఆగస్టు 31 నాటికి వంద శాతం ఈ-కేవైసీ పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో మైక్ ప్రకటనల ద్వారా మూడు నెలల బియ్యం పంపిణీ,ఈ-కేవైసీ పూర్తి గడువు గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ప్రతిరోజూ బియ్యం పంపిణీతో పాటు ఈ-కేవైసీ ప్రక్రియను సమాంతరంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద డీలర్లకు సూచించారు.

# ఆగస్టు 1నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు..

**-జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు**
**-తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం : ఐసిడిఎస్ పిడి ప్రగడ విజయ**




**/మహబూబాబాద్ జులై 31 నవ సంఘర్షణ**
శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదల, సంపూర్ణ పోషణకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేసే లక్ష్యంతో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను కర్నూలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను వేదికగా చేసుకుని గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యుల్లో తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ,సాధికారత అధికారి ప్రగడ విజయ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి ప్రగడ విజయ వెల్లడించారు. ప్రసవం జరిగిన మొదటి గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువులు ఆరోగ్యంగా ఎదుగుతారని ఆమె వివరించారు.వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు కౌన్సెలింగ్, గ్రామ సభలు, అవగాహన ర్యాలీలు, గృహ సందర్శనలు, ఐఈసీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిపాల ప్రాధాన్యత, శిశు పోషణ, తల్లి ఆరోగ్యం, కుటుంబ సభ్యుల సహకారం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

**ప్రధాన అంశాలు...**
1.శిశు, చిన్నారుల పోషణ (ఐవైసీఎఫ్) విధానాలపై అవగాహన. 2.ప్రసవం అనంతరం వెంటనే తల్లిపాలు ప్రారంభించేలా ప్రోత్సాహం. 3. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే సందేశం. 4.తల్లిపాలిచ్చే తల్లులకు కుటుంబ సభ్యులు, సమాజం నుంచి సహకారం అందేలా చైతన్యం. 5. తల్లి ఆరోగ్యం, పరిశుభ్రత, సమతుల్య ఆహారంపై అవగాహన.ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ప్రగడ విజయ పిలుపునిచ్చారు. తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి ఇంటికీ చేర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

# అంగన్వాడీ, ఆశా కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు



**/మహబూబాబాద్ జులై 31 నవ సంఘర్షణ**
తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పుట్టపర్తి కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరిన అంగన్వాడీ, ఆశా కార్యకర్తలను పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలోకి పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రతినిధులను అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో సీఐటీయూ నేతలు, పోలీసుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కలెక్టరేట్ వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పోలీసులు నిరసనకారులను శాంతింపజేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, అసంఘటిత రంగ కార్మికులు ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ కనీస గౌరవ వేతనం అమలు చేయడం లేదని ఆరోపించారు. గౌరవ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఆగస్టు 15న "చలో విజయవాడ" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఐటీయూ నేతలు ప్రకటించారు.

# వాచ్ మెన్ ను కాపాడిన సర్పంచ్



**/మెట్ పల్లి జులై 31 నవ సంఘర్షణ**
మల్లాపూర్ మోడల్ స్కూ ల్ లో వాచ్ మెన్ గా బా ధ్యతలు నిర్వహిస్తున్న స త్యనారాయణ మోడల్ స్కూల్ నుండి మల్లాపూర్ గ్రామం లోకి వచ్చే సమ యం లో అతి భారీ వర్షాల కారణంగా రోడ్డు పై భారీ ప్రవాహం చేత రోడ్డు దాట లేక భయం తో వణికిపో తున్న విషయం మల్లాపూ ర్ గ్రామ పంచాయతీ స ర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ కు తెలియడం తో పాలకవ ర్గం తో హుటాహుటిన అ తి భారీ వర్షం లెక్కచేయ కుండా వెళ్ళి వాచ్ మెన్ ను రోడ్డు దాటించి సర్పం చ్ లక్ష్మణ్ తన కారు లో గ్రామం కు తరలించారు. ఈ సంఘటన మల్లాపూర్ తెలియడం తో గ్రామస్థు లు మల్లాపూర్ పాలక వ ర్గం ను అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉప స ర్పంచ్ గడ్డం సోమరెడ్డి, వా ర్డు సభ్యులు ముష్కరి ర మేష్, అల్లె చంద్రయ్య, ముత్యాల గంగా రాజం, మహమ్మద్ షబ్బీర్, శని గారపు నరేష్,భుక్యా శేఖ ర్,సామాజిక కార్యకర్త ఏ నుగు వెంకట్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న భవ నాలను వెంటనే ఖాళీ చెయ్యాలి



**మెట్ పల్లి జులై 31 నవ సంఘర్షణ**
మెట్ పల్లి పురపాలక సంఘ కార్యాలయ సమా వేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం గు రువారం జరిగినది.మెట్ పల్లి పురపాలక సంఘ కా ర్యాలయంలో చైర్మన్ మై లారపు లింబాద్రి అధ్యక్ష తన కౌన్సిల్ సాధారణ స మావేశం నిర్వహించడం జరిగినది. ఇట్టి సమావే శంలో (22) అంశాలను పొందుపరుచగా అట్టి అం శాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలి పినారు.అనంతరం కౌన్సి ల్ సభ్యులుమాట్లాడుతూ పట్టణంలో వీది దీపాల స మస్య అధికంగా ఉన్నదని అలాగే నాణ్యమైన విద్యు త్ దీపాలను బిగించి భవి ష్యత్తులో ఇబ్బందులు రా కుండా చూడాలని, మరి యు ప్రస్తుతం వర్షాలు అ ధికంగా కురుస్తున్నందున అన్ని వార్డులలో వర్షం నీ రు నిలవకుండా తగు జా గ్రత్తలు తీసుకోవాలని, కొ న్ని వార్డులలో కల్వర్టులు మురికి కాలువలు కూలి పోయాయని వాటిని వెం టనే నిర్మించాలని,అలాగే నూతన సి.సి రోడ్లు నిర్మా ణాలపై దృష్టి సారించాల ని కోరినారు. అందుకు చై ర్మన్ మాట్లాడుతూ కౌన్సి ల్ సభ్యులు కోరే అన్ని స మస్యలను పార్టీలకు అతీ తంగా అన్ని వార్డులను స మానంగా అభివృద్ధి చేస్తా మని ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా అన్ని వార్డులలో ముందస్తు జాగ్రత్తలు తీసు కుంటామని తెలిపినారు. పట్టణ ప్రజలు శిథిలావస్థ లో ఉన్న భవనాలను వెం టనే ఖాళీ చెయ్యాలని కో రినారు.ఇట్టి సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మైలా రపు లింబాద్రి,మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్,డి. ఇ.ఇ నా గేశ్వరరావు, కౌన్సిలర్స్ , కో- ఆప్షన్ సభ్యులు మరి యు ఆఫీస్ సిబ్బంది పా ల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా "మిషన్-80" ప్రపంచ రికార్డు పోస్టర్ ఆవిష్కరణ



**హైద్రాబాద్ జులై 31 నవ సంఘర్షణ**
భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "మిషన్-80" ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతులమీదుగా వారి కార్యాలయంలో గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కరాటే రంగంలో విశేష సేవలందిస్తున్న వి. సుధాకర్ చేపట్టనున్న ఈ వినూత్న ప్రపంచ రికార్డు ప్రయత్నం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని పేర్కొంటూ, ఆయన విజయవంతంగా ప్రపంచ రికార్డు సాధించాలని ఆకాంక్షించారు. ఆగస్టు 9, 2026న ఉదయం 9 గంటలకు హైద్రాబాద్ లోని డా.జి.ఎస్. మెల్కోటే పార్క్, నారాయణగూడలో జరగనున్న ఈ కార్యక్రమంలో వి. సుధాకర్ కేవలం 8 నిమిషాల్లో 9 రకాల కరాటే బాడీ టెక్నిక్స్ ఉపయోగించి 80 షాబాద్ టైల్స్‌ను బద్దలు కొట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళిగా, యువతలో దేశభక్తి,క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమన్ గౌడ్,జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు డైరెక్టర్ డా.జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డు ప్రయత్నకర్త వి. సుధాకర్,అమృత రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, క్రీడాభిమానులు, యువత,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ చారిత్రాత్మక ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

**-టిపిసిసి డెలిగేడ్ కల్వ కుంట్ల సుజిత్ రావు**



**మెట్ పల్లి జులై 31 నవ సంఘర్షణ**
ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, అ త్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూ డదని ప్రమాదాలకు గురి కాకుండా అవసరమైన జా గ్రత్తలు తీసుకోవాలని టీ పీసీసీ డెలిగేట్ మెంబర్ క ల్వకుంట్ల సుజీత్ రావు కో రారు గురువారం వారు వి లేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు.భారీ వర్షాలు కు రువనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొం టున్నారని, అందువల్ల ప్ర జలు భారీ వర్షాల పట్ల అ ప్రమత్తంగా ఉండాల్సిన అ వసరం ఉందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమ యంలో ప్రజలు బయట కు వెళ్లకుండా ఇంట్లోనే జా గ్రత్తగాఉండాలని,పట్టణంతో పాటు పలు మండలా లు, గ్రామాల ప్రజలు వర ద ప్రవాహం ఉన్న వంతెన లు, కల్వర్ట్, రహదారులపై నుండి దాటవద్దని, శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని, తడి గా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్సఫర్స్ తాకవద్దని, శి వారు ప్రాంతాల్లో చేపల వే టకు ఎవరు వెళ్ళొద్దని సూచించారు. అదే విధం గా రైతులు కరెంటు బావు ల దగ్గరికి వెళ్లేటప్పుడు జా గ్రత్తలు పాటించాలని, వర ద నీరు వెళ్లే నాలాలు, మ్యాన్ హోల్స్ సమీపం లోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. విద్యు త్ స్తంభాలు, చెట్లు విరిగి పడే ప్రమాదాలు గతంలో చూశామని, కావున ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్త లు తప్పనిసరిగా తీసుకో వాలని సూచించారు. వ ర్షాలు, వరదల వల్ల సహా యక చర్యలు చేపట్టేందు కు స్థానిక అధికారులు సి ద్ధంగా ఉన్నారని, కానీ అ న్నిటి కన్నా ముఖ్యంగా ఎ వరికివారు వ్యక్తిగత జాగ్ర త్తలు తీసుకోవాలని కోరా రు. అత్యవసరమైతే, ఏదై నా సంఘటన జరిగితే స్థా నిక అధికారులకు సమా చారం అందించి సహాయ క చర్యలు పొందాలని కో రారు ప్రభుత్వం సంబంధి త కార్యాలయాలలో అధి కారులను అప్రమత్తం చే సిందని ఏదైనా అత్యవస రం అయితే అధికారులకు సమాచారం అందించాల ని సూచించారు.

## ప్రత్యేక ఓటరు సవరణలో ముందంజలో నిలిచిన బూత్ స్థాయి ప్రతినిధులకు సన్మానం

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండి మసూద్**




**బచ్చన్నపేట జులై 31 నవ సంఘర్షణ**
మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేసి ఆదర్శంగా నిలిచిన తొలి ఐదుగురు బూత్ స్థాయి ప్రతినిధులను బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ మసూద్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. మిగిలిన బూతుల్లోనూ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి బచ్చన్నపేటను వంద శాతం ప్రత్యేక ఓటరు సవరణ పూర్తి చేసిన మండలంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా మండలంలోని మొత్తం 47 బూతులకు గాను ఇప్పటికే 24 బూతుల్లో ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ వంద శాతం పూర్తయిందని తెలిపారు. సన్మానం పొందిన బూత్ స్థాయి ప్రతినిధుల్లో రంగు అశోక్ (కట్కూర్, నిడిగొండ, మంచేంద్ర, తమ్మడపల్లి), పొన్నం కరుణాకర్ (మన్సాన్‌పల్లి), నగేష్ (గోపాల్‌నగర్), కొక్కలకొండ బాబు (పోచన్నపేట) ఉన్నారు.
ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు నమోదు అత్యంత కీలకమని, మిగిలిన బూతుల్లో కూడా ఇదే స్ఫూర్తితో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మొహమ్మద్ మసూద్ కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర సమన్వయకర్త నిడిగొండ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దత్రపు నరేష్, సీనియర్ నాయకులు నల్లగోని బాలాకిషన్ గౌడ్ , సద్ది నర్సిరెడ్డి, జిల్లా సందీప్, గుర్రపు బాలరాజు , ఓబీసీ సెల్ నాయకుడు చెరుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సువర్ణ కంకణం అనే బంగారు పధకంతో సత్కారం



**మంథని, జులై 31 నవ సంఘర్షణ**
పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాస్ ప్రభాకర్ గత 25 సంవత్సరాలుగా వైశ్య సంఘానికి విశిష్ట సేవలు అందిస్తున్నందుకు ఆయనను వైశ్య భవన బిరుదు, బంగారు సువర్ణ పథకం బహుకరించారు. మంథని పట్టణానికి చెందిన ప్రభాకర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం చూపుగా పాల్గొంటూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇతర వేదికల ద్వారా వైశ్యులకు, సామాజిక వర్గాల వారికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ కు చెందిన లలిత కళా సమాఖ్య సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ వారిచే అత్యున్నతమైన వైశ్య వైభవ రత్న బిరుదు అవార్డు, సువర్ణ కంకణం బంగారు పథకంతో సత్కరించారు. ఈ అవార్డు కు ఎంపికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి గంద్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు రావిగంటి సతీష్, ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపి ప్రత్యేకంగా సన్మానించారు..

## పాలిటెక్నిక్ భవనాల పనులను పరిశీలించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు



**ఉమ్మడి మహబూబ్నగర్ జులై 31 నవ సంఘర్షణ**
అఖిలపక్ష ఐక్యవేదిక పోరాటంతో వచ్చిన 23 కోట్ల నిధులతో ప్రారంభమైన పాలిటెక్నిక్ భవనాల పనులను పరిశీలించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు రాజభవన పనులు కూడా త్వరగా చేపట్టాలని డిమాండ్ చేసిన అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్ భవన నిధుల మంజూరు కోసం పాటుపడ్డ పాలకులకు ధన్యవాదాలు తెలిపిన అఖిలపక్ష ఐక్యవేదిక ఈసందర్భంగా అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ, రాజ భవనం శిథిలావస్థకు చేరిందని గత ప్రభుత్వంలో పోరాటం చేసి అప్పటి విద్యాశాఖకార్యదర్శి వాకాటి కరుణని కలిసి విన్నవించుకుంటే ఆ సిఫార్సు తో 23 కోట్ల నిధులకు అంగీకారం తెలుపడం తో వచ్చిన నిధులు పనులు జరగకుంటే మళ్లీ పోరాటం చేసి సాధించుకున్న పనులు ఇప్పుడు మొదలయ్యాయి. నిధులు తేవడానికి కష్టపడ్డ ప్రతి నాయకునికి ధన్యవాదాలు తెలుపుతూ, పాలిటెక్నిక్ కళాశాల కొత్త భవనం పై అంతస్తులు, వాటి వెనుక హాస్టల్ బిల్డింగులు పరిశీలించడం జరిగింది. పనులు నాణ్యవంతంగా జరపాలని కాంట్రాక్టర్కు విజ్ఞప్తి చేస్తున్నామని, కానీ రాజప్రసాదం పనులు ఇంకా మొదలుకాకపోవడంతో అది శిథిలావస్థలో ఉన్నదనీ, కనుక వెంటనే వాటి పనులు మొదలు పెట్టాలని స్థానిక కలెక్టర్‌కి, ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేస్తున్నామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్ మైబూస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు..

# అకాల వర్షానికి కూలిన ఇల్లు

**-ఒంటరి మహిళకు కొం డంత అండగా నిలిచిన కౌన్సిలర్ బత్తుల నరేష్**




**/మెట్ పల్లి జులై 31 నవ సంఘర్షణ**
మెట్‌పల్లి పట్టణంలోని 3 వ వార్డులో అకాల వర్షం సృష్టించిన బీభత్సానికి ఒ క పేద మహిళ నిలువ నీ డ కోల్పోయింది. వార్డుకు చెందిన సోమిడీ రాజు అ నే ఒంటరి మహిళ నివాస ముంటున్న ఇల్లు హఠాత్తు గా కురిసిన వర్షాలకు కూ లిపోయింది. ఈ ప్రమా దంలో ఇల్లు సగభాగం నే లమట్టం కావడంతో ఆ మ హిళ తలదాచుకోవడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటోంది.ఈ వి షయం తెలుసుకున్న స్థా నిక 3వ వార్డు కౌన్సిలర్ బ త్తుల నరేష్ తక్షణమే స్పం దించి బాధితురాలి ఇంటి వద్దకు చేరుకున్నారు. కూ లిపోయిన ఇంటిని పరిశీ లించి, తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఒంటరి మహిళ సో మిడీ రాజును పరామర్శిం చి ధైర్యం చెప్పారు.ఈ సం దర్భంగా కౌన్సిలర్ బత్తుల నరేష్ మాట్లాడుతూ ప్రకృ తి వైపరీత్యం వల్ల నిలువ నీడ కోల్పోయిన ఒంటరి మహిళను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇ చ్చారు. నష్టపోయిన ఇం టికి సంబంధించి అధికా రులు తక్షణమే సర్వే చేసి నివేదికలు తయారు చేసే లా చూశారు, ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహా రాన్ని త్వరలోనే మంజూ రు చేయించి ఆమెకు అం డగా ఉంటానని స్పష్టం చేశారు.

# కుంట కు గండి పడకుండా కాపాడిన పాలక వర్గం



**మెట్ పల్లి జులై 31 నవ సంఘర్షణ**
మల్లాపూర్ మండల కేం ద్రం లో గురువారం అతి భారీ వర్షం కురవడం తో రైతు వేదిక వెనుక ఉన్న భాజమ్మ కుంట కట్ట పై నీ టి ప్రవాహం ఉధృతం గా ప్రవహిస్తుండటం తో గ్రామ పంచాయతీ సర్పంచ్ చి ట్యాల లక్ష్మణ్ మరియు ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి, పాలక వర్గ సభ్యులు కలిసి మట్టి తో నింపిన సంచులు అడ్డుగా వేయిం చారు.ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు ముష్కరి రమేష్,అరికుప్పల చిన్న రాజం,నర్సయ్య,సామాజిక కార్యకర్త ఏనుగు వెంక ట్ రెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

## ఖానాపూర్ లో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం



**మంథని, జులై 31 నవ సంఘర్షణ**
తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు మంథని నియోజక వర్గంలోని ఖానాపూర్ గ్రామ బూత్ నెంబర్ 100 పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్ గ్రామ సర్పంచ్ సంగెం అరుణ, గట్టయ్య సింగిల్ విండో డైరెక్టర్ రావికంటి సతీష్ యూత్ కాంగ్రెస్ నాయకులు అనిల్ రెడ్డి, నరేష్ రెడ్డి బిఎల్ఎ సీమంతుల ఓదెలు బిఎల్ఓ అమ్మకుంటి శ్రీధర్ యూత్ కాంగ్రెస్ నాయకులు పెగడ రాజు, మల్లయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

## భాగ్యనగర్ కాలనీలో నిల్వ నీటి సమస్య పరిష్కారానికి చర్యలు పర్యటించిన టీపీసీసీ అధికార ప్రతినిధి దారిపల్లి రాజశేఖర్ రెడ్డి.



**ఎల్ బి నగర్ - జులై 31 నవ సంఘర్షణ**
లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ, రోడ్ నెం. 6లో వర్షాల కారణంగా ఏర్పడిన నీటి నిల్వ సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దారిపల్లి రాజశేఖర్ రెడ్డి శుక్రవారం ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, హైడ్రా అధికారుల సహకారంతో నిల్వ నీరు తొలగించి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా ప్రత్యేక క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దారిపల్లి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం అత్యంత ముఖ్యమని అన్నారు. భాగ్యనగర్ కాలనీలో నీటి నిల్వకు కారణమైన సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. సమస్య పరిష్కారంలో తక్షణమే స్పందించి సహకరించిన ఎంఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్ గారు, హైడ్రా అధికారి బల్వంత్ మరియు వారి బృందానికి దారిపల్లి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## మెదక్ జిల్లాకు అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీని నియమించాలని డీఐఈఓకు వినతిపత్రం.




**మెదక్ జిల్లా,- జులై 31 నవ సంఘర్షణ**
మెదక్ జిల్లాకు అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీని తక్షణమే నియమించాలని కోరుతూ తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం రోజు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఐఈఓ)కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన అనంతరం సిద్దిపేట,సంగారెడ్డి జిల్లాల్లో అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీలను నియమించి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ,మెదక్ జిల్లాలో ఇప్పటివరకు సెక్రటరీని నియమించకపోవడం వల్ల క్రీడా కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఎస్‌జీఎఫ్ఐ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ లేదా ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిని మెదక్ జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీగా వెంటనే నియమించాలని కోరారు.విద్యార్థుల క్రీడా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈవిషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు,జిల్లా కార్యదర్శి మధు,రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి,సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ కృష్ణ,గజేంద్రుల నర్సింలు,బసవరాజ్,కృష్ణ, శోభ,శృతి,గీతతో పాటు పలువురు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మంబోజిపల్లి పల్లె చెరువుకు నిలిచిన వరద నీరు ప్రవాహం..

**-కాల్వలో ప్రహరీ కూలడమే కారణం. గ్రామస్తులు ఆరోపణ.**



**మెదక్ జిల్లా జులై 31 నవ సంఘర్షణ**
మెదక్ మండలం లోని మంభోజిపల్లి గ్రామంలోని పల్లె చెరువుకు నిలిచిన వరద నీళ్లు కాల్వలో ప్రహరీ గోడ కూలడమే కారణమని గ్రామస్తులు మీడియాతో ఆరోపించారు. మెదక్ మండల పరిధిలోని ఘనపూర్ ఆయకట్టు ద్వారా వచ్చే నీరు మాచవరం గ్రామం నుంచి మంబోజిపల్లి పల్లె చెరువులోకి వచ్చే నీటి కాల్వలో ప్రహరీ గోడ కూలిపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో చెరువుకు నీరు చేరక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మాచవరం గ్రామానికి చెందిన సూర్యకాంత్ (ఇంటి నెం. 1-1-20) నివాసం వద్ద ఉన్న ప్రహరీ గోడ కాలువలో కూలిపోవడంతో పాటు కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యపై మంబోజిపల్లి గ్రామ సర్పంచ్ మానస రాములు, ఉపసర్పంచ్ మహేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఇరిగేషన్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెరువులోకి నీరు రాకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కాల్వలోని మట్టిని తొలగించి, కూలిపోయిన ప్రహరీ కారణంగా ఏర్పడిన అడ్డంకులను తొలగించి చెరువులోకి నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

# గడ్డిఅన్నారం డివిజన్‌లో కృంగిపోయి ప్రమాదకరంగా ఉన్న వరద కాలువ మ్యాన్‌హోల్స్‌ను వెంటనే పునరుద్ధరించాలి





**-బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.**

**గడ్డి అన్నారం జులై 31 నవ సంఘర్షణ**
గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న కృంగిపోయి ప్రమాదకరంగా మారిన వరద కాలువ మ్యాన్‌హోల్స్‌ను తక్షణమే పునరుద్ధరించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ రోజు గౌతం నగర్, పటేల్ నగర్ కాలనీలలో స్థానికుల విజ్ఞప్తి మేరకు పర్యటించిన ఆయన, కృంగిపోయిన మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఎంఎంసీ ఏఈ సాయి, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్‌ను సంఘటనా స్థలానికి పిలిపించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా మ్యాన్‌హోల్ దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.
ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గడ్డిఅన్నారం డివిజన్‌లో పలుచోట్ల వరద కాలువ మ్యాన్‌హోల్స్ కృంగిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాల ముప్పు అధికంగా ఉన్నందున అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే వరద కాలువలకు సంబంధించిన పెండింగ్ పనులను కూడా ఎలాంటి జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టితో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌతం నగర్ కాలనీ వాసులు బాలకృష్ణ గౌడ్, శారద, ప్రవీణ్, గండి జగన్ యాదవ్, వెంకటేశం, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఎంసీ గడ్డిఅన్నారం ఏఈ సాయి, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

# భాగ్యనగర్ కాలనీలో వర్షపు నీరు డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.







**ఎల్ బి నగర్ - జులై 31 నవ సంఘర్షణ**
ఎల్ బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బుధవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో వర్షపు నీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు స్వయంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హనుమాన్ దేవాలయం సమీపంలో వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి రోడ్డుపై నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, నిల్వ నీటిని తొలగించినప్పటికీ కొద్దిసేపటికే మళ్లీ వరదనీరు చేరుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇంద్ర నాగేంద్ర నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు ఉన్న ట్రంక్ లైన్‌లో ఎక్కడైనా చెత్తాచెదారం పేరుకుపోయిందేమో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు వెంటనే డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను తనిఖీ చేయగా, పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో డ్రైనేజీ ప్రవాహం నిలిచిపోయి వర్షపు నీరు కాలనీలోకి చేరుతున్నట్లు గుర్తించారు. అనంతరం మ్యాన్‌హోల్స్‌లోని చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి శుభ్రపరచడంతో భాగ్యనగర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు సాఫీగా వెళ్లిపోయింది. సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి నిర్వహణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# భారీ వర్షాలకు రాయిన్ పల్లి ప్రాజెక్ట్ కెనాల్ తో పాటు ఏడు గ్రామాలకు ముప్పు.



**మెదక్ జిల్లా జులై 31 నవ సంఘర్షణ**
గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెదక్ మండలం రాయినపల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కూలిపోగా, చెరువు కట్ట కూడా సగానికి పైగా దెబ్బతినడంతో ఏడు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రోజున పద్మా దేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రాజెక్ట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ఏడాది వరద వల్ల దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, రహదారులకు శాశ్వత మరమ్మతులు చేయకుండా తాత్కాలిక పనులతో సరిపెట్టుకొన్నారని మండిపడ్డారు. డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పూర్తిగా కూలిపోయిందని గత రోజుల వర్షాలకే కాల్వ కట్ట, చెరువు కట్ట దెబ్బతినడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఏడు గ్రామాలకు ప్రత్యక్షంగా, మరో పది గ్రామాలకు పరోక్షంగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కాల్వ దెబ్బతినడంతో రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా అయ్యిందని అన్నారు.రెండు నెలల క్రితమే రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి మరమ్మతులు చేపట్టాలని కోరినా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కెనాల్ పూర్తిగా కొట్టుకుపోవడంతో చెరువు కట్టకు పెను ముప్పు ఏర్పడిందని, కామారెడ్డి జిల్లా దంతేపల్లి వైపు నుంచి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఏడు గ్రామాల ప్రజలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో స్వయంగా కట్టను పూడ్చే కార్యక్రమం చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజ గౌడ్ తోపాటు మాజీ ఎంపీపీ కిష్టయ్య, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,నాయకులు న్యాయవాది జీవన్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నరేందర్,రాయిన్ పల్లి మాజీ సర్పంచ్ నాగులు, పార్టీ అధ్యక్షులు జంగం వీరస్వామి, మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు నాయకులు బాలయ్య నర్సాగౌడ్ నర్సింలు, దుర్గయ్య, కిష్టయ్య సిద్ధిరాములు,శీను భాస్కర్, యాదగిరి శ్రీధర్ రైతులు తదితరులు ఉన్నారు.

## భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా మైనారిటీ

# మోర్చా నూతన కార్యవర్గం ఎన్నిక.



**మెదక్ జిల్లా - జులై 31 నవ సంఘర్షణ**
మెదక్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు గ్యన్ సింగ్ ఆధ్వర్యంలో మైనారిటీ మోర్చా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులందరికీ పార్టీ కండువాలు కప్పి, అధికారికంగా బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మైనారిటీ మోర్చా నాయకులు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు గ్యన్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నిరుడి లాజర్, సయ్యద్ గౌస్ పాషా, ఉపాధ్యక్షులు కరమ్ సింగ్, షేక్ మొహమ్మద్, ఎండీ ఖలీల్, కార్యదర్శులు ఎండీ నవబొద్దీన్, అజయ్ సింగ్, కోశాధికారి పర్వేజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు: సర్వన్ సింగ్, అమర్ సింగ్ ల ను నియమించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, పాపన్నపేట మండల అధ్యక్షులు సంతోష్ చారి, మరియు జిల్లా నాయకులు లోకేష్, మధు, రాజు, శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పసిడి ప్రియులకు అలర్ట్.. పెరిగిన బంగారం, స్థిరంగా వెండి ధరలు..! ఇవాళ్టి గోల్డ్ రేట్ ఎలా ఉందంటే..

భారతదేశంలో బంగారం ఎప్పుడూ ప్రియమైనదే.. పండుగలు, పెళ్లిళ్లు, పుట్టిన రోజులు ఇలా శుభ సందర్భం ఏదైనా సరే.. మన వాళ్లు తప్పనిసరిగా గోల్డ్ కొంటుంటారు. కానీ, గత రెండేళ్ల కాలంలో పసిడి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కనీస అవసరాలకు కొనుగోలు చేసే పరిస్థితి కూడా లేకుండా చేసింది. 2025 సంవత్సరాంతం వరకు గోల్డ్ షాకిస్తూనే వచ్చింది. ఇక, ఈ ఏడాది ఆరంభం నుండి తగ్గుతూ, పెరుగుతూ లక్షన్నరకు అటు ఇటూగా ఊగిసలాడుతూ వస్తోంది. భారతదేశంలో ఈ రోజు 24 క్యారెట్ల బంగారం ధర 10గ్రాములు రూ.1,44,340లు ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1,32,310లు పలుకుతోంది. దేశంలోని ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి.

-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,44,340, 22 క్యారెట్ల ధర రూ.1,32,310 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.



-ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,44,490, 22 క్యారెట్ల ధర రూ.1,32,460 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

-ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,44,340, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,32,310 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,44,340, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,32,310 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

-కోల్‌కత్తాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,44,340, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,32,310 ఉంది. వెండి కిలో ధర రూ.2,35,100లుగా ఉంది.

-హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,340, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,32,310 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,340, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,32,310 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

పైన సూచించిన ఈ ధరలు ఉదయం 8 గంటల లోపు మార్కెట్ ప్రారంభానికి ముందుగా నమోదైనవి మాత్రమే.. మార్కెట్ ప్రారంభంతో గోల్డ్ రేట్స్ మారిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి, బంగారం, వెండి నగలు, ఆభరణాలు కొనుగోలు చేయాలనుకున్న వారు తప్పని సరిగా అప్పటి ధరలు చెక్ చేసుకోవటం మంచిది.

## మారుతికి ముడిసరుకు సెగ

### క్యూ1లో రూ.3,446 కోట్లకు పరిమితమైన లాభం



**న్యూఢిల్లీ, జూలై 31**

మారుతి సుజుకీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,446. 90 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.3,792.4 కోట్ల లాభంతో పోలిస్తే 9.11 శాతం తగ్గుముఖం పట్టింది. గత త్రైమాసికంలో రికార్డు స్థాయిలో వాహనాలను విక్రయించినప్పటికీ ముడి సరుకుల వ్యయం అధికం కావడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. అయినప్పటికీ సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 35.9 శాతం ఎగబాకి రూ.52,469.8 కోట్లకు చేరుకున్నది. కిందటేడాది ఇదే త్రైమాసికానికిగాను రూ.38,605.2 కోట్లుగా నమోదైంది. నిర్వహణ ఖర్చులు రూ.35,585.4 కోట్ల నుంచి రూ.50 వేల కోట్లకు పెరుగడం వల్లనే లాభాల్లో ప్రతికూల వృద్ధి నమోదైందని పేర్కొంది. దీంట్లో ముడి సరుకు కోసమే రూ.32,013 కోట్ల నిధులను వెచ్చించింది. మారుతి రికార్డు స్థాయిలో వాహనాలను విక్రయించింది. గత త్రైమాసికానికిగాను సంస్థ 6,82,724 యూనిట్ల వాహన అమ్మకాలు జరిపింది. ఒక త్రైమాసికంలో ఇంతటి స్థాయిలో వాహనాలను విక్రయించడం ఇదే తొలిసారి

## మూడోరోజూ లాభాల్లో సూచీలు

### 78 వేల పాయింట్లపైకి సెన్సెక్స్

**ముంబై, జూలై 31**

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో జోరుమీదున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు భారీగా నష్టపోయినప్పటికీ విదేశీ మదుపర్లు భారీగా నిధులు కుమ్మరించడంతో సూచీలు మూడు వారాల గరిష్ఠ స్థాయిని తాకాయి. వారాంతపు ట్రేడింగ్‌లో ఒక దశలో 300 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 166.49 పాయింట్లు అందుకొని తిరిగి 78 వేల పాయింట్ల పైకి చేరుకున్నది. చివరకు 78,094.64 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 66.45 పాయింట్లు అందుకొని 24,383.60 వద్ద స్థిరపడింది. సూచీల్లో పాజిటివ్ ట్రెండ్



కొనసాగుతున్నదని, పెరిగిన రాబడులు, వడ్డీరేట్ల పెంపుపై ఉన్న ఆందోళన నేపథ్యంలో మదుపర్లలో జాగ్రత్తకొనసాగినప్పటికీ, సానుకూల వృద్ధి కొనసాగిందని..ఈ పునరుద్ధరణ స్థిరత్వం ప్రధానంగా, ప్రస్తుత అంచనాలను మించి రాణిస్తున్న ప్రస్తుత ఆదాయాల సీజన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడం కలిసొచ్చిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఇటీవల కాలంలో భారీగా లాభపడిన ఐటీ రంగ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరిగిందన్నారు.

## భారత్‌కు తొలిసారి విచ్చేస్తున్న బ్రెజిల్..

# స్పోర్ట్స్

### -కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్..!

సాకర్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఊహించినట్టుగానే బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు భారత పర్యటన ఖరారైంది. ఆ దేశ సీనియర్ టీమ్ మొట్టమొదటిసారి ఇండియాకు రానుంది. ఫుట్‌బాల్‌ను అమితంగా ఇష్టపడే కోల్‌కతావాసులను అలరించేందుకు సాల్ట్ లేక్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది బ్రెజిల్ జట్టు. అక్టోబర్‌లో బ్లూ టైగర్స్‌తో ఈ మ్యాచ్ విషయాన్ని శుక్రవారం బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా వెల్లడించింది.ఫిఫా వరల్డ్‌కప్ జోష్ ముగిసినా.. భారత్‌లో మళ్లీ ఫుట్‌బాల్ సందడి మొదలవ్వనుంది. మేటి జట్లలో ఒకటైన బ్రెజిల్ అక్టోబర్‌లో ఇండియాకు వస్తోంది. భారత జట్టుతో మ్యాచ్ కోసం ఆ దేశ సీనియర్ జట్టు రావడం ఖరారైందని బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది. ఫుట్‌బాల్ అంటే పడిచచ్చే జనమున్న




కోల్‌కతాలో అక్టోబర్ 3వ తేదీన బ్లూ టైగర్స్‌ను బ్రెజిల్ ఢీకొట్టనుంది. 'ది గోట్ ఇండియా టూర్' పర్యటనలో లియోనల్ మెస్సీ బృందం అభిమానులతో మమేకమైన సాల్ట్ లేక్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగనుంది.బ్రెజిల్ జాతీయ జట్టు షెడ్యూల్ కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో ఫ్రెండ్లీ మ్యాచ్ అనంతరం మా తర్వాతి అడుగు భారత్‌లో. మా ఫుట్‌బాల్ చరిత్రలో అదొక మరపురాని అధ్యాయం కానుంది. అక్టోబర్ 3వ తేదీన భారత గడ్డపై బ్రెజిల్ టీమ్ మొట్టమొదటి మ్యాచ్ ఆడనుంది. ఇందుకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం వేదిక కానుంది. ఏళ్ల తరబడి బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుకు భారీగా అభిమానులున్న కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడడం చాలా ప్రత్యేకం కానుంది. ఈ పర్యటన కోసం మేము ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. మిమ్మల్ని కోల్‌కతాలో కలుస్తాం' అని సీబీఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. నెయ్‌మర్ సారథ్యంలోని బ్రెజిల్ ఫిఫా వరల్డ్‌కప్ 2026లో నాకౌట్ దశలోనే వెనుదిరిగిన విషయం తెలిసిందే.

## చీఫ్ సెలెక్టర్ రేసులో అశ్విన్.. వరల్డ్‌కప్ ముందే బాధ్యతలు చేపట్టేనా..!



వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కంటే ముందు చీఫ్ సెలెక్టర్‌గా సేవలందిస్తున్న అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియనుంది. సెప్టెంబర్‌తో అగార్కర్ కాలపరిమితి పూర్తి కానున్నందున తదుపరి ప్రధాన సెలెక్టర్ ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అశావహులు చాలామందే ఉన్నప్పటికీ మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ రేసులో అందరికంటే ముందున్నాడనే కథనాలు వస్తున్నాయి. బీసీసీఐ కూడా అగార్కర్ స్థానంలో మాజీ ఆఫ్ స్పిన్నరైన యశ్‌కు బాధ్యతలు అప్పగించనుందనే వార్తలు నెట్టింట వైరలవుతున్నాయిసీనియర్లను పక్కన పెట్టేసి.. కుర్రాళ్లకు పెద్దపీట వేయడంతో పాటు స్క్వాడ్ ఎంపిక కూడా అస్సలు బాగుండడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ ఓటమితో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, ప్రధాన సెలెక్టర్ అగార్కర్ పనితీరపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో, పదవీకాలం ముగింపు దశలో ఉన్న గవార్కర్‌ను పొడిగిస్తారా? లేదా? అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. అప్పుడే అగార్కర్ వారసుడు ఎవరు? అనే చర్చ మొదలైంది.ఎందుకంటే.. మరో నెల రోజుల్లో(సెప్టెంబర్) చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ పదవీకాలం ముగియనుంది. దాంతో, కాబోయే ప్రధాన సెలెక్టర్ ఎవరు? పోటీలో ఎవరెవరు ఉన్నారు? అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అగార్కర్ అనంతరం మాజీ ఆటగాడు రవించంద్రన్ అశ్విన్ ప్రధాన సెలెక్టర్ పదవిని చేపట్టే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ముందే అశ్విన్ నియామకం జరుగుతుందని ఆన్‌లైన్‌లో కథనాలు వస్తున్నాయి. దాంతో.. ఒక్కసారిగా అశ్విన్ ఎక్స్‌లో ట్రెండ్ అవుతున్నాడు. రిటైర్మెంట్ అనంతరం సొంత యూట్యూబ్ ఛానెల్లో క్రికెట్ విశ్లేషణలు చేస్తున్న స్పిన్ దిగ్గజం మాత్రం ఈ వైరల్ వార్తలపై స్పందించలేదు. బీసీసీఐ సైతం అగార్కర్ మార్పుపై ఎలాంటి ప్రకటన ఇంకా చేయలేదు.

## యువ పేసర్లపై సెలెక్టర్ల ఫోకస్.. మహ్మద్ షమీ రీఎంట్రీపై సందిగ్ధం

భారత జట్టు సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ అంతర్జాతీయ క్రికెట్‌లో తిరిగి చోటు దక్కించుకోవడం కష్టమేనా? ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి. ఒకప్పుడు భారత బౌలింగ్ దళానికి ప్రధాన బలంగా నిలిచిన షమీ.. ఇప్పుడు సెలెక్టర్ల దీర్ఘకాలిక ప్రణాళికల్లో చోటు దక్కించుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్ చేరడంలో షమీ కీలక పాత్ర పోషించాడు. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచి తన ప్రతిభను చాటుకున్నాడు. అనంతరం 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో చివరిసారిగా భారత జట్టు తరఫున వన్డే ఆడగా, అదే ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో చివరిసారి కనిపించాడు. టెస్టు క్రికెట్‌కు వస్తే.. దాదాపు మూడేళ్లుగా అతను భారత జట్టు తరఫున ఆడలేదు.గాయాలతో సుదీర్ఘకాలం ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ షమీ దేశీయ క్రికెట్‌లో మంచి ప్రదర్శనలతో తన ఫిట్‌నెస్‌ను నిరూపించేందుకు ప్రయత్నించాడు. అయినప్పటికీ జాతీయ జట్టులో తిరిగి చోటు సంపాదించలేకపోయాడు. ఆగస్టు 15 నుంచి



శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా వెలువడిన ఒక నివేదిక ప్రకారం, భారత సెలక్షన్ కమిటీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ పేసర్లపై దృష్టి సారించింది. రాబోయే సంవత్సరాల్లో భారత పేస్ దళానికి నాయకత్వం వహించగల 15 మంది యువ ఫాస్ట్ బౌలర్ల జాబితాను సెలెక్టర్లు సిద్ధం చేసినట్లు సమాచారం. మూడు ఫార్మాట్లను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ జాబితాలో మహమ్మద్ షమీ పేరు లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ రాబోయే టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్, 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో టీమిండియాలో తరాల మార్పు వేగంగా జరుగుతోంది. సీనియర్ ఆటగాళ్ల స్థానాలను యువ ప్రతిభ క్రమంగా భర్తీ చేస్తోంది. ఈ నిర్ణయంపై మాజీ భారత కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. యువ బౌలర్లైన గుర్నూర్ బ్రార్, మొహ్సిన్ ఖాన్, ప్రిన్స్ యాదవ్ వంటి ఆటగాళ్లు మంచి ప్రతిభ కలిగినవారేనని, భవిష్యత్తులో ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, షమీ వంటి అనుభవజ్ఞుడైన బౌలర్‌ను పూర్తిగా పక్కన పెట్టడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. షమీ ఒక అద్భుతమైన మ్యాచ్ విన్నర్. అలాంటి బౌలర్‌ను ఒక్కసారిగా పక్కన పెట్టడం సరైన నిర్ణయమా అనే సందేహం కలుగుతోంది. అనుభవం, నైపుణ్యం కలిగిన ఆటగాళ్లను సరైన సమయంలో ఉపయోగించుకోవడం కూడా జట్టు ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది అని శ్రీకాంత్ పేర్కొన్నారు.



## నభా నటేష్ స్టన్నింగ్ లుక్స్..

# భిమానులకు అప్‌డేట్.. కార్తీ 'సర్దార్ 2' టీజర్ లాంచ్‌కి టైం ఫిక్స్!




కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం 'సర్దార్ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్స్ ఇస్తూ ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ ట్రీట్ రాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ క్రమంలోనే హీరో కార్తీ తాజాగా ఒక పవర్-ప్యాక్డ్ కొత్త పోస్టర్‌ను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. 'సర్దార్ 2' సినిమా టీజర్‌ను నేడు శుక్రవారం సాయంత్రం సరిగ్గా 7 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ఆయన కన్ఫర్మ్ చేశారు. దీంతో కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కార్తీ అభిమానులు ఈ హై-వోల్టేజ్ టీజర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటి పార్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో, ఈ సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రంలో టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండటం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఇక మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్, ఈసారి కూడా తన మ్యూజిక్‌తో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు రాబోతున్న టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# హిట్లు కొట్టినా పట్టించుకోవడం లేదే..!

### అవకాశాల కోసం ఎదురుచూస్తున్న కేథరిన్ థ్రెసా

మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ అయింది అందాల ముద్దుగుమ్మ కేథరిన్ థ్రెసా. హీరోయిన్ గా కెరీర్ మొదలు పెట్టి తొలి సినిమాతోనే మంచి హిట్ అందుకుంది. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది ఈ అమ్మడు.. పూరీజగనాద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఇద్దరమ్మాయిలతో అనే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది. ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన నటించి ఆకట్టుకుంది. తొలి సినిమాలో గ్లామరస్ గా కనిపించి మెప్పించింది కేథరిన్ థ్రెసా. సినిమా డిజాస్టర్ అయినా ఈ ముద్దుగుమ్మ గ్లామర్ కు మంచి మార్కులు పడ్డాయి.. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది. కానీ సాలిడ్ సక్సెస్ మాత్రం అందుకోలేకపోయింది ఈ చిన్నది. స్టార్ హీరోల సినిమాల్లో నటించిన హిట్స్ పడలేదు. అదే క్రమంలో ఆచితూచి సినిమాలు ఎంచుకుంటూ వచ్చింది. మెయిన్ హీరోయిన్ గానే కాదు సెకండ్ హీరోయిన్ గానూ సినిమాలు చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరైనోడు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించింది. అలాగే రానా నేనే రాజు నేనే మంత్రి సినిమాలోనూ సెకండ్ హీరోయిన్ గా కీలక పాత్రలో మెరిసింది. ఇక కళ్యాణ్ రామ్ నటించిన బింబిసార సినిమాతో భారీ హిట్ ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో కూడా ఇద్దరు హీరోయిన్స్ నటించారు. ఇలా చాలా వరకు సెకండ్ హీరోయిన్ గానే మెప్పించింది కేథరిన్ థ్రెసా. వీటితోపాటే ..

చిరంజీవి రవితేజ నటించిన వాల్తేరు వీరయ్య సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఈ సినిమాలో రవితేజ సరసన నటించింది. ఈ సినిమాలన్నీ మంచి విజయాలను అందుకున్నాయి. మెయిన్ హీరోయిన్ గానే కాదు, సెకండ్ హీరోయిన్ గానూ నటించి ఆకట్టుకుంది ఈ అందాల భామ. వరుసగా హిట్స్ అందుకుంటుంది కానీ మెయిన్ హీరోయిన్ గా అనుకున్నంతగా గుర్తింపు మాత్రం తెచ్చుకోలేకపోతుంది ఈ బ్యూటీ. ఇక ఇటీవలే మన శంకర వరప్రసాద్ గారు అనే సినిమాలో నటించింది. ఈ సినిమాలో చిరంజీవి అసిస్టెంట్ గా కనిపించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అయినా కూడా కేథరిన్ థ్రెసాకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. సినిమాలతోనే కాదు సోషల్ మీడియాలోనూ ఈ బ్యూటీ తన అందాలతో అదరగొడుతుంది. తన గ్లామరస్ ఫొటోలతో కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ.



## కార్తీ 'సర్దార్ 2' టీజర్ లాంచ్‌కి టైం ఫిక్స్!




కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం 'సర్దార్ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్స్ ఇస్తూ ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ ట్రీట్ రాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ క్రమంలోనే హీరో కార్తీ తాజాగా ఒక పవర్-ప్యాక్డ్ కొత్త పోస్టర్‌ను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. 'సర్దార్ 2' సినిమా టీజర్‌ను నేడు శుక్రవారం సాయంత్రం సరిగ్గా 7 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ఆయన కన్ఫర్మ్ చేశారు. దీంతో కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కార్తీ అభిమానులు ఈ హై-వోల్టేజ్ టీజర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటి పార్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో, ఈ సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రంలో టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండటం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఇక మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్, ఈసారి కూడా తన మ్యూజిక్‌తో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు రాబోతున్న టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆ విషయం గురించి రోజూ ప్రార్థిస్తా!



పెద్దగా మేకప్‌హంగులు లేకుండా తెరపై సహజసిద్ధమైన అందంతో మెరిసిపోతుంటుంది తమిళ సోయగం సాయిపల్లవి. అందుకే అభిమానులు ఆమె నేచురల్ బ్యూటీ అని పిలుస్తుంటారు. నటనతో పాటు అందంలో కూడా సహజత్వంతో అలరారే ఈ భామ సౌందర్య ఉత్పత్తులకు చాలా దూరంగా ఉంటుందన్న విషయం తెలిసిందే. వాటి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారానికి కూడా అస్సలు అంగీకరించదు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన చర్మసంరక్షణ, ఆహారపు అలవాట్ల గురించి ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుందీ అమ్మడు. ఖరీదైన సౌందర్య ఉత్పత్తులు, మేకప్ కంటే శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యమని, అదే సహజమైన అందాన్ని తీసుకొస్తుందని అభిప్రాయపడింది. ఆహారం విషయంలో నేను పరిమితుల్ని పాటిస్తా. వెజిటెబుల్స్‌తో పాటు నట్స్ ఎక్కువగా తీసుకుంటా. ఎక్సర్‌సైజ్‌ని నా దినచర్యలో ఓ భాగంగా చేసుకున్నా' అని చెప్పింది. తానింతవరకూ షాంపు ఉపయోగించలేదని, కేశసంరక్షణ కోసం అలోవెరాతో తయారుచేసిన నేచురల్ షాంపుని వాడతానని, జుట్టుని మూడురోజులకు ఒకసారి మాత్రమే శుభ్రం చేసుకుంటానని సాయిపల్లవి చెప్పింది. అన్నింటికంటే ముఖ్యంగా జట్టు అస్సలే ఊడిపోవద్దని ప్రతి రోజు దేవుణ్ణి ప్రార్థిస్తుంటానని, అది మానసికంగా చాలా ప్రభావం చూపిస్తుందని చెప్పుకొచ్చిందీ భామ. ప్రస్తుతం సాయిపల్లవి 'రామాయణ' చిత్రంలో సీత పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.